క్లుప్తంగా

ఎమ్మెల్యేకు గల్ఫ్‌బాధితుడి కృతజ్ఞతలు



ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్న శ్రీనివాస్

మల్యాల: ఏజెంట్ చేతిలో మోసపోయిన యువకుడికి అండగా నిలిచిన చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు బాధితుడు మంగళవారం కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని బల్వంతాపూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్ ఏజెంట్ చేతిలో మోసపోయి దుబాయ్‌లో లోనే బందీగా ఉన్నాడు. సోషల్ మీడియా ద్వారా గోడు వెళ్లబోసుకున్నాడు. విషయాన్ని కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఆయన భారత రాయబార కార్యాలయ అధికారులతో మాట్లాడి, బాధితుడు శ్రీనివాస్ స్వగ్రామానికి రావడానికి కృషి చేశారు.

మోడల్ పోలింగ్ కేంద్రం పరిశీలన



పోలింగ్ కేంద్రం వద్ద డీఎల్‌పీవో, అధికారులు

పెగడపల్లి:లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పెగడపల్లిలో మహిళల కోసం ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రాన్ని డీఎల్‌పీవో కనకదుర్గ మంగళవారం సందర్శించారు. కేంద్రంలో ఉన్న సౌకర్యాలు, కావాల్సిన వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వసతులు కల్పించాలని సూచించారు. మండల ప్రత్యేక అధికారి వేణుగోపాల్‌రావు, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో మహేందర్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బడిబాట ర్యాలీ

కథలాపూర్: మండలం అంబారిపేటలో ప్రభుత్వ ఉపాధ్యాయులు మంగళవారం బడిబాట ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఉపాధ్యాయులు కోరారు. పలువురి విద్యార్థుల అడ్మిషన్లు తీసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ క్లాసులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు కిషన్‌రావు, రత్నకుమారి, సీఆర్‌పీలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం



అడిషనల్ ఎస్పీకి చెక్కు అందిస్తున్న వైద్యులు

జగిత్యాలక్రైం: జగిత్యాల పట్టణంలో సీసీకెమెరాలను ఏర్పాటు చేసేందుకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వారు ట్రైనింగ్ అడిషనల్ ఎస్పీ శివం ఉపాధ్యాయ, డీఎస్పీ రఘుచందర్‌కు మంగళవారం రాత్రి జగిత్యాల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో రూ.1.50 లక్షల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో పట్టణ సీఐ వేణుగోపాల్, ఎస్సై మన్మథరావు, ఏఎస్సై వేణురావు పాల్గొన్నారు.

'రైతుల సహకారం మరువలేనిది'



రైతులతో మాట్లాడుతున్న రమ్య ఆదిరెడ్డి

మేడిపల్లి: కమ్మరిపేట రైతుల సహకారంతో, గ్రామ ప్రజల దీవెనలతో మేడిపల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గా తనకు అవకాశం లభించిందని కమ్మరిపేట రైతుల దీవెనలు, సహకారం ఎప్పటికీ మరువలేనని మేడిపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్ పర్సన్ ఉదిగిరి రమ్య- ఆదిరెడ్డి అన్నారు. భీమారం మండలంలోని కమ్మరిపేటలో మంగళవారం రైతు సంఘం నాయకులను రమ్య,ఆదిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.తదనంతరం రైతు కండువాలు కప్పి వారిని ఘనంగా సన్మానించారు.ముందు ముందు కూడా గ్రామానికి, మండలానికి సేవ చేసే అవకాశాల్ని ఇవ్వాలని వారిని కోరారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ ఎంపీగా బోయినపల్లి వినోద్ కుమార్ ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పెద్దెతున రైతు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

తీరిన పశుగ్రాసం కొరత

- బేలర్‌తో గడ్డి కట్టలు కట్టిస్తున్న రైతులు
- ట్రాక్టర్ల ద్వారా నేరుగా రైతుల ఇంటికే..
- వరి గడ్డికి ఫుల్ డిమాండ్



ట్రాక్టర్‌తో గడ్డి కట్టలను ఇంటికి తీసుకెళ్తున్న రైతు

జగిత్యాలఅగ్రికల్చర్: రైతులు హార్వేస్టర్లతో పొలాలు కోయిస్తుండటంతో, గడ్డి తుక్కు తుక్కుగా మారి, పొలమంతా పడటంతో, రైతులు పొలాల్లోనే గడ్డిని కాల్చేస్తున్నారు. దీంతో, డెయిరీ ఫారం నిర్వాహకులకు, పాడి రైతులకు పశుగ్రాసం కరువైంది. వేసవిలోనైతే పశువులకు బయట పచ్చిగడ్డి లేక ఇంట్లో ఎండు గడ్డి లేక పెంపకందారులు మరింత ఇక్కట్లకు గురువుతున్నారు. ఈ యాసంగిలో జిల్లాలో వరి పంట ఆశించిన స్థాయిలో లేకపోవడంతో పశుగ్రాసానికి మరింత డిమాండ్ పెరిగింది. ఈ నేపథ్యంలో అక్కడక్కడ ఉన్న వరి గడ్డిని, గడ్డి కట్టే యంత్రాల ద్వారా కట్టలు కట్టించి నేరుగా రైతుల ఇళ్లకు చేర్చుతూ, పశుగ్రాసం కొరత తీర్చుతున్నారు.

గడ్డి కట్టలు కట్టే యంత్రాలు..

గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కటి, రెండు వరిగడ్డి కట్టలు కట్టే యంత్రాలు వచ్చాయి. ఎకరం పొలంలోని గడ్డిని గంటలోపే 40–50 కట్టలు కడుతుంది. యంత్రం ద్వారా కట్టలు కట్టినందుకు ఒక్కో కట్టకు రూ 40–50 వరకు తీసుకుంటున్నారు. దీంతో, గ్రామీణ ప్రాంతాల్లో పాడి రైతులు, ముందుగా రైతులతో పొలంలోని గడ్డి తీసుకెళ్లేందుకు ఎంతో కొంత డబ్బు చెల్లించి, యంత్రంతో కట్టలు కట్టిస్తున్నారు. దీంతో గడ్డికి సైతం డబ్బులు వస్తుండటంతో, చాలా మంది రైతులు గడ్డిని కాల్చేందుకు వెనుకడుగు వేస్తున్నారు.

ప్రస్తుత సీజన్‌లో డిమాండ్

యాసంగి సీజన్‌లో ఎక్కువగా మొక్కజొన్న వేయడంతో వరి గడ్డికి డిమాండ్ ఏర్పడింది. గత ఏడాది ఉచితంగా ఇచ్చిన రైతులు ఎకరంలోని గడ్డికి రూ 3–4 వేలు తీసుకుంటున్నారు. మరో ఆరు నెలల వరకు గడ్డి దొరికే అవకాశం లేకపోవడంతో, డెయిరీ ఫారాల రైతులు గడ్డిని కొనుగోలు చేసి, కట్టలు కట్టించి, ఫారాలకు తెచ్చుకుని షెడ్లలో నిల్వ చేసుకుంటున్నారు. జిల్లాలో బోర్నపల్లి, తాటిపల్లిలో గోశాలలు ఉన్నాయి. ఒక్కో గోశాలలో 60–100 వరకు పశువులు ఉన్నాయి. వాటికి గడ్డిని దానం చేయాలని గోశాల నిర్వాహకులు కోరుతున్నారు. చివరకు గడ్డి ఇస్తే, కట్టలు కట్టించుకుని, మేము తీసుకెళ్లతామని రైతులను కోరుతున్నారు.

పశుగ్రాసాన్ని ఇప్పుడేనిల్వ చేసుకోవాలని పశువైద్యాధికారి బద్దం రాజేందర్ రెడ్డి అన్నారు. యాసంగి సీజన్‌లో వరి కోతలు నడుస్తున్నందునా, పశుగ్రాసాన్ని సేకరించుకుని, 2–3 పశువులకు కనీసం 100 గడ్డి కట్టలు ఉండేలా చూసుకోవాలని తెలిపారు.

హామీల అమలుపై కాంగ్రెస్‌ను నిలదీయాలి

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

సారంగాపూర్: కాంగ్రెస్ పార్టీ వాళ్లు ఓట్ల కోసం గ్రామాల్లోకి వస్తే ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై నిలదీయాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. బీర్‌పూర్ మండలం కొల్వాయి, కండ్లపల్లి గ్రామాల్లో మంగళవారం ఉపాధి హామీ కూలీలు చేపట్టిన పనుల వద్దకు వెళ్లి బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉపాధి పనిదినాలు, కూలి పెంచుతామని హామీలు ఇచ్చారని, ఈ హామీలను ఎందుకు అమలు చేయలేదో ప్రశ్నించాలని కోరారు. ఆరు గ్యారంటీల మోసపూరిత హామీలిచ్చి అమలు చేయకుండా మోసం చేశారన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ ముప్పాల రాంచందర్ రావు, మాజీ జెడ్పీటీసీ కొల్ముల రమణ, మండల పార్టీ అధ్యక్షుడు నారపాక రమేష్, నాయకులు రామకిష్టు గంగాధర్, రాంచంద్రం, చంద్రయ్య, మారుతి, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీ పటిష్టతకు కృషి చేయాలి

రాయికల్: బీఆర్‌ఎస్ పార్టీ పటిష్టతకు కృషి చేయాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కోరారు. మంగళవారం అయోధ్య గ్రామ అధ్యక్షుడిగా బండారి సురేశ్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా రాజ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా రవీందర్, కార్యదర్శిగా చొప్పదండి తిరుపతికి ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కోలశ్రీనివాస్, మాజీ సర్పంచ్ ఎద్మల జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

'కొప్పుల'ను గెలిపించాలి



వెంగళాయిపేటలో మాట్లాడుతున్న నందిని

పెగడపల్లి: గత ప్రభుత్వంలో ఈశ్వర్ మంత్రిగా ఉన్న సమయంలో జరిగిన అభివృద్ధి చూసి కారు గుర్తుకు ఓటేయ్యాలని ఆయన కూతురు నందిని ఓటర్లను కోరారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి, తన తండ్రి కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా మండలంలోని వెంగళాయిపేటలో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఆమె మంగళవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ కూలీలను కలిసి మాట్లాడుతూ పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి మేలు చేసిన బీఆర్‌ఎస్‌ను మరచిపోవద్దని కోరారు. ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. పార్టీ నాయకులు మల్లారెడ్డి, వెంకన్న, నరేందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, సత్యనారాయణరావు, రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మల్యాల: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుందని, సంక్షేమం, అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మల్యాల మండలంలోని ముత్యంపేట, తాటిపల్లి, లంబాడిపల్లి, తక్కళ్లపల్లి, మ్యాడంపల్లి, మానాల, గ్రామాల్లో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీగా వెలిచాల రాజేందర్ రావును గెలిపించాలని కోరారు. బీజేపీ, బీఆర్‌ఎస్ రెండు ఒకటేనని, పదేళ్లలో రాష్ట్రాన్ని బీఆర్‌ఎస్, దేశాన్ని బీజేపీ అప్పుల ఊబిలోకి నెట్టాయనఅనరు. త్వరలో రుణ మాఫీ, రేషన్ కార్డు, పెన్షన్లు అందజేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో జోరుగా ప్రచారం



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బుగ్గారం: మండలంలోని చిన్నాపూర్, చందయ్యపల్లె గ్రామాల్లో మంగళవారం కాంగ్రెస్ ప్రచారం జోరుగా సాగింది. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుభాష్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీల వద్దకెళ్లి కాంగ్రెస్ ప్రవేశ పెట్టిన ఆరు గ్యారంటీల గురించి వివరించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నర్సాగౌడ్, కనుకయ్య, ప్రభాకర్, భీమేశ్ తదితరులున్నారు.

జీవన్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం



ఉపాధి కూలీలను ఓట్లు అభ్యర్థిస్తున్న నర్సింగరావు

మల్లాపూర్: కాంగ్రెస్‌తోనే అందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి అన్నారు. మల్లాపూర్ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో మంగళవారం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ప్రధాని మోదీ పదేళ్లలో చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పకుండా మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా కాంగ్రెస్‌పై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. అరవింద్ అహంకార రాజకీయాలకు ముగింపు పలికేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. జీవన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సేవాదళ్ మండల అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, పూంద్ర శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

జీవన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

మెట్‌పల్లిరూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్ ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. మెట్‌పల్లి మండలం కోనరావుపేటలో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు..కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు జలపతిరెడ్డి మండల అధ్యక్షుడు అంజిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల: కాంగ్రెస్ అభ్యర్థి జీవన్ రెడ్డికి మద్దతుగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు కోరుట పట్టణంలోని 15 వ వార్డు బీమునిదుబ్బలో కౌన్సిలర్లు తిరుమల గంగాధర్ గౌడ్, ఆడెపు కమల, కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

జగిత్యాలటౌన్: నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డిని గెలిపించాలని కాంగ్రెస్ శ్రేణులు 3వ వార్డులో ఇంటింటి ప్రచారం చేశారు. చిలుకవాడలో ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లను కలిసి కాంగ్రెస్ మేనిఫెస్టో ప్రతులను పంపిణీ చేశారు.కార్యక్రమంలో జగిత్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, నాయకులు ముదుగంటి చంద్రశేఖర్‌రెడ్డి, రాజ్‌గోపాల్‌రావు, రాజేశ్వర్‌రెడ్డి, పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో...

ఇబ్రహీంపట్నం: నిజామాబాద్ ఎంపీగా జీవన్‌రెడ్డికి గెలిపించాలని మాజీ ఎంపీపీ పుష్పలత ఇంటింటికీ వెళ్లి మంగళవారం ప్రచారం చేశారు. మాజీ ఎంపీపీ పుష్పలత కూరగాయల మార్కెట్‌లో, మండలంలోని మూలరాంపూర్, బర్ధీపూర్, వేములకుర్తి గ్రామాల్లో ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను అందచేసి చేతి గుర్తుకు ఓటు వేసి జీవన్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని మాజీ జెడ్పీటీసీ సునీత, జీఎస్ వెంకట్ కోరారు.

ప్రజా సంక్షేమానికి బీఆర్‌ఎస్‌నే గెలిపించాలి

మల్లాపూర్: ప్రజా సంక్షేమ కోసం కృషి చేసిన బీఆర్‌ఎస్‌నే ప్రజలు గెలిపించాలని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు బదినపెల్లి ప్రేమ్ అన్నారు. మంగళవారం మల్లాపూర్ మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డికి మద్దతుగా ప్రజాప్రతినిధులు నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజలకు మేలు చేకూరాలంటే ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నల్ల రాజేశ్వర్, దామెర నర్సయ్య, ఉయ్యాల లక్ష్మణ్, నల్ల లక్పతి పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనం

జగిత్యాలటౌన్: అభివృద్ధి చేసే దమ్మున్న లీడర్ జీవనన్నను నిజామాబాద్ ఎంపీగా గెలిపించుకుందామని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి పిలుపునిచ్చారు. పట్టణంలోని సర్దార్ సత్రంలో మంగళవారం నిర్వహించిన రాంబజార్ ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. జీవనన్న ఆధ్వర్యంలోనే సర్దార్ సత్రానికి స్థలం కేటాయించినట్లు గుర్తు చేశారు. ఆర్యవైశ్యులంతా ఏకతాటిపై ఉండి రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో జీవనన్నను భారీ మెజార్టీతో గెలిపించి అభివృద్ధిలో భాగస్వాములు కావాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్లు, గిరి నాగభూషణం, తాటిపర్తి విజయలక్ష్మి, నాయకులు కొత్త మోహన్, మంచాల కృష్ణ, గాజుల రాజేందర్, పిప్పరి అనిత, కమటాల శ్రీనివాస్,అడువాల లక్ష్మణ్, ఆర్యవైశ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

కేసీఆర్ చేసిన అభివృద్ధిని చూసి ఓటేయండి



కోరుట్లలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్

కోరుట్ల/కోరుట్ల రూరల్: రాష్ట్రాన్ని కేసీఆర్ అన్ని రంగాల్లో చేసిన అభివృద్ధిని చూసి ఓటేయాలని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. యూసుఫ్‌నగర్, మోహన్‌రావుపేట గ్రామాల్లో నిర్వహించిన కార్నర్ మీటింగుల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రాన్ని కేసీఆర్ అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. ప్రజలు ఆలోచించి ఓటేయాలని కోరారు. జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, తిమ్మయ్యపల్లి, కల్లూర్ గ్రామాల్లో ఉపాధి కూలీల వద్దకు వెళ్లి బీఆర్‌ఎస్ కు మద్దతు ఇవ్వాలని కోరారు. పట్టణంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట నారాయణ, జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య, బీఆర్‌ఎస్, పట్టణ, మండల అధ్యక్షులు అన్నం అనిల్, దారిశెట్టి రాజేష్, సీనియర్ నాయకుడు చీటి వెంకట్రావు, నాయకులు పాల్గొన్నారు.

'బీజేపీ, కాంగ్రెస్‌ల మోసపూరిత హామీలు నమ్మొద్దు'

కథలాపూర్: ఎన్నికలప్పుడు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు చెప్పే మోసపూరిత హామీలను ప్రజలు నమ్మవద్దని బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి లోక బాపురెడ్డి కోరారు. కథలాపూర్ మండలం భూషణరావుపేట, గంభీర్‌పూర్ గ్రామాల్లో మంగళవారం ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి ప్రచారం చేశారు. బీఆర్‌ఎస్ హయాంలో పేదలకు ఇచ్చిన హామీలను నెరవేర్చామని, రైతులకు పంటల పెట్టుబడి కోసం సకాలంలో రైతుబంధు డబ్బులు ఇచ్చామన్నారు. ఎంపీ ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్‌కు మద్దతు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జవ్వాజి రేవతి, ఎంపీటీసీ కొండ ఆంజనేయులు, నాయకులు లోక శశిధర్‌రెడ్డి, తీట్ల శంకర్, బద్దం మహేందర్, కొత్తపెల్లి శ్రీనివాస్, గడ్డం శేఖర్‌రెడ్డి, పూంద్ర జనార్దన్‌రెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అవినీతిరహిత పాలనకు బీజేపీని ఆదరించండి



ఉపాధి కూలీలను ఓట్లు అభ్యర్థిస్తున్న నాయకులు

మల్లాపూర్: దేశంలో అవినీతిరహిత పాలన కోసం బీజేపీని ఆదరించాలని బీజేపీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మల్లాపూర్ మండలంలోని వాల్గొండ శివారులో మంగళవారం ఉపాధిహామీ కూలీలను కలిసి బీజేపీ ఎంపీ అభ్యర్థి అర్వింద్‌ను గెలిపించాలని కోరారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ప్రధాని మోదీ నేతృత్వంలో దేశం అన్నిరంగాల్లో పురోగతిని సాధించిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అర్వింద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ రమేష్, నాయకులు గంగారాం, గంగాధర్ పాల్గొన్నారు.

ఉపాధి పనుల వద్ద ప్రచారం

మేడిపల్లి: మండలంలోని తొంబరావుపేట, కమ్మరిపేట, దమ్మన్నపేట గ్రామాల్లో మంగళవారం వేములవాడ బీజేపీ కన్వీనర్ క్యాతం దశరథరెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేసి, కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ ని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కారంద్ల మధుకర్, తొగరి లక్ష్మీపతి, కోటగిరి లింగయ్య గౌడ్, అడువాల లింగారెడ్డి, వన్నెల శివానందం, జలపతి రెడ్డి, పాల్గొన్నారు.

వేసవిలో లోతు దుక్కులతో లాభాలు

ఇబ్రహీంపట్నం: వేసవిలో లోతు దుక్కులు దున్నడంతో అనేక ప్రయోజనాలు ఉంటాయని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీలత రైతులకు వివరించారు. మండలకేంద్రంలోని రైతువేదికలో శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులకు అవగాహన కల్పించారు. పంటలు అవశేషాల గురించి, భూమిలో కలియ దున్నడం వలన కలిగే లాభాలను చౌడు భూములు బాగు చేసుకోవడం, విత్తనశుద్ధి, పచ్చి రొట్ట పైరుల పెంపకం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో దీపిక, ఏఈవోలు నరేశ్, రవళిక, రైతులు పాల్గొన్నారు.

'పదేళ్లలో గౌడ సామాజిక వర్గానికి న్యాయం జరగలేదు'

సారంగాపూర్: గడచిన పదేళ్ల పాలనలో గౌడ సామాజిక వర్గానికి న్యాయం జరగలేదని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్ అన్నారు. మండలంలోని రంగపేటలో మంగళవారం కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీ పాలనలో గౌడ సామాజిక వర్గం ఆర్థికంగా, విద్యా పరంగా ఎదగడానికి చర్యలు తీసుకునేలా సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే కార్యాచరణ రూపొందించారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కోల జమున, మాజీ జెడ్పీటీసీ భూక్య సరళ, మాజీ సర్పంచ్‌లు మోత్కూరి ప్రసాద్‌గౌడ్, తోడేటి శేఖర్‌గౌడ్, ఆర్యవైశ్యం సంఘం జిల్లా నాయకులు మహాంకాళిరాజన్న, నాయకులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లులపై చర్యలు తీసుకోవాలని వినతి

రాయికల్: మండలంలోని కుమ్మరిపల్లి సహకార కొనుగోలు కేంద్రంలో రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్‌మిల్లు నిర్వాహకులు తరుగు పేరుతో క్వింటాలుకు 2 కిలోలు కటింగ్ పేరుతో రైతులను మోసం చేస్తున్నారని, వెంటనే రైస్‌మిల్లు నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని మంగళవారం రైతులు రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కటింగ్ పేరుతో మోసం చేస్తున్న రైస్‌మిల్లులపై చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైత సంఘ నాయకులు తోట రాజిరెడ్డి, అంబాల సంజీవ్‌రెడ్డి, పవన్, ప్రతాప్‌రెడ్డి, తిరుపతి, నవీన్, రాజు, సంతోష్, బోడుగం అంజన్న, శీలం పెద్దలింగన్న, కొడిమ్యాల సాయిలు, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

మెట్‌పల్లి: పట్టణంలోని శాంతినగర్‌లో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని మంగళవారం పోలీసులు పట్టుకున్నారు.సుమారు 5 క్వింటాళ్ల బియ్యం ఉన్నట్లు గుర్తించి సీజ్ చేసి కొండపల్లి మారుతి అనే వ్యక్తిపై కేసు నమోదు చేశారు.

జేసీబీ,ట్రాక్టర్లు సీజ్

పట్టణ శివారులోని మైసమ్మ గుట్ట నుంచి అనుమతులు లేకుండా మట్టి తీస్తున్న జేసీబీ, రెండు ట్రాక్టర్లను మంగళవారం పోలీసులు పట్టుకున్నారు.తదుపరి చర్యల కోసం రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

చీరలు పట్టివేత

మెట్‌పల్లి: బిల్లులు లేకుండా ఓ వాహనంలో తరలిస్తున్న 490 చీరలను పట్టుకున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.వాటి విలువ రూ. 1.47 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మల్లాపూర్: మండలంలోని ఒబులాపూర్ శివారులో మంగళవారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టరును పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఒబులాపూర్ శివారులో పెట్రోలింగ్ చేస్తుండగా, ఇసుకను తరలిస్తున్న ట్రాక్టరును పట్టుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమావేశమైన పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

రాయికల్: మండలంలోని భూపతిపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2008–09 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా తమకు చదువు చెప్పిన గురువులు కోటేశ్వర్‌రావు, భూపతిరావు, జక్కుల రాజేంద్రప్రసాద్, కట్కం మధు, సంజన, బందెల తిరుపతిని ఘనంగా సన్మానించారు. ఆనాడు చేసిన అల్లరిని , పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకుని సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో తాజామాజీ సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్, ఉపసర్పంచ్ అన్నవేని వేణు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఇబ్రహీంపట్నంకు కోదండరాం రాక

ఇబ్రహీంపట్నం: మెట్‌పల్లిలో బుధవారం జరగనున్న ప్రొఫెసర్ కోదండరాం ప్రచారసభను విజయవంతం చేయాలని తెలంగాణ జనసమితి పార్టీ కోరుట్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కంతి మోహన్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్ ఎంపీగా జీవన్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. టీజేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకుంట శంకర్, మండల అధ్యక్షుడు కంతి రమేశ్, నాయకులు ఈజాపు రాజరెడ్డి, ఎడిపెల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.